ప్రజాశక్తి
గురువారం 7 నవంబరు, 2024
5
శ్రీకాకుళం



13న శ్రీకూర్మంలో తెప్పోత్సవం



ప్రజాశక్తి - గార

మండలంలోని శ్రీకూర్మంలో గల శ్రీకూర్మనాథ స్వామి వారి తెప్పోత్సవాన్ని ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి ఆలయం ఎదురుగా గల శ్వేత పుష్కరిణిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాత్రికులు అధిక సంఖ్యలో హాజరు కానున్న దృష్ట్యా వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

'ఉపాధి'కి రక్షణగా...



ఉపాధి పనులు కల్పించాలంటూ జెడ్‌పి వద్ద ఆందోళన చేస్తున్న కూలీలు (ఫైల్)

- అడిగిన వారందరికీ పని కల్పించాలని ఆందోళనలు
- కూలీలకు 200 రోజుల పని, రూ.600 కూలి కోసం నిరంతర పోరు
- వ్యవసాయ కార్మిక సంఘ పోరాటాలకు సిపిఎం సంఘీభావం

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లేని రోజుల్లో కూలీలకు కొంత ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) 2005లో తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వామపక్షాల మద్దతుతో ఏర్పాటైన యుపిఎ-1 హయాంలో రూపొందించిన ఈ చట్టంతో పేదలు కాస్తాకూ స్తో గంజి నీళ్లు తాగగలుగుతున్నారు. అప్పల కోసం తమపై ఆధారపడిన కూలీలు తమను ఖాతరు చేయకపోవడంతో రాజకీయ నేతలుగా చలామణి అవుతున్న భూస్వాములు దీన్ని తీసేయాలనే డిమాండ్లనూ పెడుతున్నారు. వీరి కోర్కెను నెరవేర్చడానికా అన్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్లుగా చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక వినాశకర మార్పులు తీసుకొచ్చింది. ఉపాధి చట్ట రక్షణ, కూలీల హక్కులు కాపాడడంలో సిపిఎం చురుకైన పాత్ర పోషించింది. ఈనెల 9, 10 తేదీల్లో పలాసలో సిపిఎం 18వ జిల్లా మహాసభల నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం అమల్లో సిపిఎం సాగించిన పోరాటాలు, చేసిన కృషిపై ప్రత్యేక కథనం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 4.32 లక్షల మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు జారీ చేయగా, వాటిలో 3.78 లక్షల కార్డులు మనుగడలో ఉన్నాయి. మొత్తం 7.49 లక్షల మంది కూలీలకు గానూ ఏడాదిలో 6.08 లక్షల మంది చురుగ్గా పనుల్లోకి వస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న ఉపాధి హామీ పనులకు 2.50 లక్షల మందికి పైగా హాజరవుతున్నారు. ఇందులో మహిళలే అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. పురుషులు సమీప పట్టణాలకు వెళ్లి రకరకాల పనులు చేస్తూ ఆదాయం తెస్తున్నా సరిపోవడం లేదు. దీంతో గ్రామాల్లో చేపడుతున్న పనులకు వస్తున్నారు. వీరితో పాటు 50 ఏళ్లు పైబడిన వారూ ఎక్కువ మంది పనుల్లో ఉంటున్నారు. కొడుకులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడంతో చేసేది లేక కొంతమంది అందరితో పాటే పనులకు వస్తున్నారు. ఉపాధి పనుల ద్వారా వచ్చిన డబ్బులతో బతుకీడుస్తున్నారు.

కేంద్రం షరతులతో కూలీలకు ఇక్కట్లు

గ్రామీణ ప్రాంతాల్లో ఈ సీజన్‌లో 80 శాతం మందికి జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు గత పదేళ్లలో అనేక మార్పులు, రకరకాల షరతులను పెడుతోంది. ఈ-మస్టరు పేరుతో మొబైల్ ద్వారా మస్టర్లు వేయించడం, ఫేషియల్ అటెండెన్స్ వంటి విధానాలతో కూలీలను పనులకు దూరం చేసే విధానాలను అవలంభిస్తోంది. ఉపాధి కూలీలకు అదనంగా చెల్లించే వేసవి భృతిని రెండేళ్లుగా కేంద్రం ఆపేసింది. 2020-21 వరకు ఉపాధి హామీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) టెక్నాలజీని వినియోగించేది. దేశవ్యాప్తంగా ఒకటే విధానం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 2021-22 నుంచి ఏపిని కూడా ఎన్‌ఐసి (నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అప్పటివరకు అందుతున్న సౌకర్యాలన్నీ ఆగిపోయాయి. వీటిలో వేసవి భత్యం ప్రధానమైంది. ఫిబ్రవరిలో అదనంగా 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం చొప్పున చెల్లించేవారు. ఎండలతో భూమి గట్టి పడడం, వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతల్లో పనిచేయడం కష్టంగా ఉంటుందని వేసవి భత్యం కింద అదనంగా చెల్లించేవారు. వేసవిలో పనికి హాజరయ్యే కూలీలకు గతంలో మజ్జిగ కోసం రోజుకు రూ.5 చొప్పున అదనంగా చెల్లించేవారు. రెండేళ్లుగా దాన్నీ నిలిపేశారు. సాధారణ రోజుల్లో తాగునీటి కోసం తాగునీటి కోసం రూ.5 చొప్పున చెల్లించే విధానాన్ని ఎత్తేసింది.

పని ప్రదేశాల్లో సౌకర్యాల కోసం అనేక ఆందోళనలు

వేసవిలో పని ప్రదేశాల్లో తగిన సదుపాయాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతూనే పనిచేస్తున్న పరిస్థితి ఉంది. కూలీలు సేదతీరేందుకు ప్రభుత్వం కనీసం టార్పాలిన్లనూ ఇవ్వలేదు. మండు వేసవిలో 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో చెమటలు కక్కుతూనే పనిచేస్తున్న పరిస్థితి నెలకొంది. కూలీలు వడదెబ్బకు గురై మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. ఇంట్లో ఉంటే ఆకలి బాధ, పనుల్లోకి వెళ్తే వడదెబ్బ అన్నట్లుగా వారి పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ చట్టం అమల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏపి వ్యవసాయ కార్మిక సంఘం అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టింది.

'ఉపాధి'ని కాపాడుకునేందుకు అనేక పోరాటాలు

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ఉపాధి చటాన్ని పటిష్టంగా అమలు చేయాలని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలంటూ ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నిరంతం పోరాటాలు సాగిస్తూనే ఉంది. కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలంటూ పలురూపాల్లో ఆందోళనలు చేపట్టింది. ఉపాధి హామీ చట్టం అమలు, కూలీల హక్కులపై చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రతి ఏడాదీ ఏప్రిల్‌లో ఉపాధి యాత్రలు చేస్తోంది. కూలీలకు బకాయిలు చెల్లింపులు, వారికి తాగునీరు, నీడ, మెడికల్ కిట్లను అందించాలంటూ అనేక పర్యాయాలు గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టింది. వ్యవసాయ కార్మిక సంఘం నిరంతర పోరాటాలకు సిపిఎం అండగా నిలవడం వల్లే ఉపాధి హామీ చట్టం జోలికి వెళ్లడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సాహసించడం లేదు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ఇళ్ల పట్టాల రద్దు అన్యాయం

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ దువ్వాడ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంతబొమ్మాళి మండలం మేఘవరం, ఉమిలాడ పంచాయతీల్లో నిరుపేదలకు ఇచ్చిన హుదూద్ ఇళ్లు, ఇళ్ల పట్టాలను రద్దు చేసి ఇతరులకు అమ్ముకునేందుకు అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నిరుపేదలైన లబ్ధిదారులకు అన్యాయం చేయడం తగదన్నారు. టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు పేదలను విస్మరించి టిడిపి నాయకులకు లబ్ది చేకూర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంతబొమ్మాళి ఎంపిపి మేరుగు అప్పారావు, మేఘవరం సర్పంచ్ పరపటి శ్రీనివాస్ రెడ్డి, బోరుభద్ర ఎంపిటిసి సభ్యులు చిన్నారావు, శ్రీరాములు, రావివలస ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, వైసిపి నాయకులు మేనకేతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

శ్రీకాకుళం అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో ప్రధానోపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, నగర శాఖ కార్యదర్శి వైకుంఠరావు కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎడి శ్రీనివాసరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హతలు ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్పొరేషన్ యాజమాన్యంలో ఉన్న స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో ఉన్న అన్ని ఖాళీలను డిఎస్‌సిలో చూపించకుండా 70:30 నిష్పత్తిని పాటించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల విషయంలో అసంబద్ధాలను సరిచేయాలన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి



మూలసవలాపురంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రవికుమార్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ పాలన ఆధ్వర్యాన గ్రామీణ రహదారులకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మూలసవలాపురం గ్రామ పంచాయతీలో రూ.58.35 లక్షలు, పెద్ద సవలాపురం పంచాయతీలో రూ.87 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు తర్లాడ ఈశ్వరరావు, పల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో దోచుకో, దాచుకో అన్న పద్ధతులను పాటించారు తప్ప ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రహదారులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారుల అనుసంధానంతోనే అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి సాధ్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారులను గుంతల రహిత రోడ్లుగా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక నిధులు విడుదల చేశారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో రహదారులు, డ్రైనేజీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించారని తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలా తమది గారడి ప్రభుత్వం కాదని, ప్రజా ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఎపిఒ పార్వతి, టిడిపి నాయకులు తర్లాడ సురేంద్ర, శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, అంబల్ల రాంబాబు, కిల్లి సిద్ధార్థ, తాడేల రాజారావు, మాజీ ఎంపిపి కె.అప్పలనాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పెంచాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్




వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలురైతు సంఘం నాయకులు

విశాఖ డెయిరీ పాడి రైతులకు తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రామీణ ప్రజానీకం పశువుల పోషణతో జీవనోపాధిని పొందుతున్నారని చెప్పారు. అటువంటి పాడి రైతులకు విశాఖ డెయిరీ తీరని నష్టాలను మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల పశు పోషణ భారమవుతోందని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని చేసుకుని పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరను తిరిగి పెంచాలన్నారు. రైతులకు వచ్చే పాల ధరలో తగ్గించి బోనస్ ఇవ్వడం కాకుండా, డెయిరీ లాభాల నుంచి నాలుగు నెలలకోసారి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విశాఖ డెయిరీలో అవినీతిపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించి, కారకులను శిక్షించాలన్నారు. ఆవు పాలు లీటరుకు రూ.50, గేదె పాలు లీటరుకు రూ.80 ఇప్పించాలని కోరారు. 75 శాతం రాయితీతో పశు దాణా ఇవ్వాలన్నారు. విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుంచి సహకార రంగంలోకి తీసుకురావాలన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను పరిరక్షించి రైతాంగాన్ని అదుకోవాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

రేపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఈనెల ఎనిమిదో తేదీన నరసన్నపేటలో పర్యటించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం నరసన్నపేట ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన తల్లిపాల కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలనలో పలు శాఖల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తారని, అనంతరం బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై చర్చిస్తారని వివరించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆకస్మిక తనిఖీ ఉంటుందని తెలిపారు.



రేపు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు రెండో స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12కు ఒకటో స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు 7వ స్థాయి, మూడు గంటలకు 6వ స్థాయి, సాయంత్రం నాలుగు గంటలకు 3వ స్థాయి, ఐదు గంటలకు 5వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

పథకాలను మహిళలు అందిపుచ్చుకోవాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందిపుచ్చుకుని సాధికార దిశగా మహిళలు అడుగులు వేయాలని సమగ్ర మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ సూచించారు. ఆ దిశగా గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఆఫ్ ఉమెన్ కార్యక్రమంలో భాగంగా సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, డిసిపియు ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎల్‌ఐసి చీఫ్ మేనేజరు సుబ్బారావు, డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీనివాసులు ఎల్‌ఐసిలో మహిళలకు ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోస్టల్ ఎఎస్‌పి బి.విశ్వేశ్వరరావు, హెడ్‌పోస్టు మాస్టరు రంగారావు, అసిస్టెంట్ హెడ్ పోస్టుమాస్టర్ ఎం.భానోజీరావు పోస్టల్ శాఖ పరిధిలో అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన ప్రాముఖ్యత, బాలికలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. గ్రామాల్లో బాలికలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, సిడిపిఒలు పలు అంశాలను ప్రస్తావించి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే శంకర్‌ను సన్మానిస్తున్న స్థానికులు

శ్రీకాకుళం అర్బన్: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వీలుగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్, నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో బుధవారం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టారు. నగరంలోని పలు వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలతో పాటు గార, శ్రీకాకుళం మండలాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు ఆయా ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మౌలిక అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పెన్షన్లు, ఇళ్లు, రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలతో ప్రజలు నిరంతరం కలుస్తున్నారని, వారికి న్యాయం చేసేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న లీడర్‌షిప్ శిక్షణను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్.వి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శిక్షణలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందిన ఉపాధ్యయుడు టి.వి రత్నకుమార్‌కు తమ సంతాపాన్ని తెలిపారు. గతేడాది ఈ శిక్షణా తరగతులను నిర్వహించారని, ప్రస్తుతం అపార్ నమోదు, పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్, ఫీజు చెల్లింపు, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ, ఈనెల 14న మెగా పేరెంట్స్ మీటింగ్ తదితర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో శిక్షణా తరగతులు నిర్వహించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రెండు, మూడు జిల్లాలకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, అదీ రెసిడెన్షియల్ విధానంలో చేయడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బోధన తప్ప మిగిలిన అన్ని పనులు రుద్దడం వల్ల తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న అన్ని శిక్షణలను వాయిదా వేసి, తదుపరి శిక్షణా కేంద్రాల సంఖ్యను పెంచి నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

శ్రీకాకుళం: సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన ఈనెల ఏడో తేదీన పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట వైటిసిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంయుక్తంగా ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోని రెండో ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసిన, 18 నుంచి 28 ఏళ్లలోపు గల విద్యార్థినీ విద్యార్థులు అర్హులని స్పష్టం చేశారు. ఈ మూడు నెలలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ, ఉచిత భోజనం, వసతి, యూనిఫారాలు, పుస్తకాలు, ఎసి క్యాంపస్ వంటి సదుపాయాలతో శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

104 వాహనాల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రాజెక్టు నోడల్ అధికారి డాక్టర్ టి.శ్రీకాంత్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని చెప్పారు. 104 సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 104 సేవల్లో 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిఒ 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పిఎఫ్ మొత్తాలను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు శ్లాబ్ అమలు చేయాలని కోరారు. డిఎస్‌సి ద్వారా ఎంపికైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు విధానంలో కొనసాగించాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.


చెక్కును అందజేస్తున్న సిఐటియు, అగ్రికమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

కార్మికుల ఔదార్యం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల
నాగార్జున అగ్రికం కార్మికులు, ఉద్యోగుల ఔదార్యాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్‌ఎసిఎల్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, హెచ్‌పిడి హెడ్ కె.శ్యాంప్రసాదరావు అభినందించారు. నాగార్జున అగ్రికం పరిశ్రమలో పనిచేస్తూ కార్మికుడు సుతారి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మృతుని కుటుంబానికి ఎన్‌ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా వసూలు చేసి ఇచ్చిన మొత్తాన్ని పరిశ్రమలో జరిగిన సమావేశంలో మృతుని భార్య సుందరమ్మ, అల్లుడు వి.రాజశేఖర్‌లకు చెక్కును యాజమాన్య ప్రతినిధులు , సిఐటియు యూనియన్ నాయకుల చేతులమీదుగా అందజేశారు. ఒక్కరోజు వేతనంతో పాటు గ్రాడ్యుటీతో కలుపుకొని రూ.12,76,052 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులుగా పనిచేస్తూ ఏ ఒక్కరు చనిపోయిన తమతో పాటు పనిచేస్తున్న కార్మికులంతా ఒక్కరోజు వేతనం ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థికభరోసా ఏర్పడుతుందనిన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, సిహెచ్. సత్యనారాయణ, జె.నూకరాజు, పి.చిన్న, కె.అప్పన్న పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- పలాస
ఆర్‌టిసిలో నష్టాల పేరుతో బస్సులు తగ్గించి కార్మికుల పొట్టకొడుతున్నారని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎం.ఎ.రాజు, దిలీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలాస ఆర్‌టిసి డిపో ఆవరణలో బుధవారం ఎర్ర రిబ్బన్లు ధరించి ధర్నా చేపట్టారు. ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకు సుమారుగా 25 బస్సులు తిరుగుతున్నాయని అన్నారు. నష్టం వస్తుందనే నెపంతో వాటిని తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపోలో 400 మంది కార్మికులు పనిచేస్తున్నారని, తాగేందుకు నీటి సౌకర్యం లేదని అన్నారు. బస్సుల్లో రేడియేటర్లో నీరు వేసేందుకు నీటి సౌకర్యం లేకపోవటంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. డిపో పరిధిలో 13 లక్షల పైబడి బస్సులు తిరిగాయని, దీంతో రహదారి మధ్యలో ఆగిపోతున్నాయని, దీంతో డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే డిపో పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.సి.హెచ్.రావు, పి.ఎల్.నారాయణ, బి.ఎం.రావు, వి.డి.రావు, జి.కె.రాజు, కె.ఎం.రావు తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతుల అనంతరం కుళాయిల ద్వారా వస్తున్న తాగునీరు

కేశవరాయుపురంలో ఎట్టకేలకు తాగునీరు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు
మండల కేంద్రం లావేరు పంచాయతీలో అధికారులు స్పందించారు. ఎట్టకేలకు యుద్ధప్రతిపాధికన డైరెక్ట్ పంపింగ్ మోటార్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. కేశవరాయపురంలో దాహం కేకలు శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో మండల అధికారులు స్పందించారు. బుధవారం ఇఒపిఆర్‌డి వి. విశ్వేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా జెఇ మీసాల మణికంఠలు కేశవరాయపురంలో మరమ్మతులకు గురైన మోటర్‌ను ఇన్‌ఛార్జి కార్యదర్శి రమేష్ వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించి వీధుల్లోని ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరును అందజేశారు. దీంతో గ్రామంలో తాగునీరు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుపై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి- పొందూరు


మోహనరావు

వైద్యారోగ్య శాఖలో ముఖ ఆధారిత హాజరు జీతాలతో అనుసంధానం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని తెలుగునాడు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పంగా మోహనరావు కోరారు. మండలంలోని కింతలి పిహెచ్‌సిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కరోనా వంటి విపత్కర సమయంలో పగలు, రాత్రి తేడా లేకుండా తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలను అందించిన వైద్య ఆరోగ్యశాఖకు ముఖ ఆధారిత హాజరును జీతాలను ముడిపెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ముఖ ఆదారిత హాజరు విషయంలో సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ఒక ప్రతిభంధక మవుతుందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈయనతో పాటు సంఘ జిల్లా జనరల్ సెక్రటరీ ఎ.సత్యనారాయణ తదితరులున్నారు.


కందకాలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

'ఉపాధి'తో రైతులకు మేలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్
ఉపాధిహామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేయడం వలన రైతులకు మేలు జరుగుతుందని ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కోష్ట పంచాయతీ పైడిపేటలో పైడి వెంకటరావు కొబ్బరి తోటలో చెట్లు చుట్టు బుధవారం ఉపాధిహమి ద్వారా కందకాలు తవ్వటం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఒక కొబ్బరి చెట్టుకు ముగ్గురు చెప్పున తవ్వితే రూ.280 నుంచి రూ.300 వరకు వేతనం అందుతుందన్నారు. ప్రభుత్వం ఉపాధిహమి పథకాన్ని రైతులకు అనుసంధానం చేయటంతో రైతులు చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం


రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్
భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో సర్పంచ్ రజని ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భూసర్వే పేరుతో అనేక తప్పుడు రికార్డులు సృష్టించిందన్నారు. ప్రతి రైతు ఏ సమస్య ఉన్నా స్వచ్ఛందంగా వినతిపత్రం అందించి భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. రీ సర్వేలో పొరపాట్లును సరిదిద్దేందుకు అవసరమైతే ఫీల్డ్‌కి వచ్చి సంబంధిత సమస్య పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, మండల సర్వేయర్ రవి, ఆర్‌ఎస్ డిటి శ్రీదేవి, సెక్రటరీ నారాయణమ్మ, విఆర్‌ఒ వరలక్ష్మి, విలేజ్ సర్వే శ్రీరామ్, ఎంపిటిసి సంజీవ్, వార్డ్ మెంబర్స్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

లావేరు: రీసర్వే భూసమస్యలు గ్రామసభలతోనే పరిష్కరించడం జరుగుతుందని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. బుడతవలస పంచాయతీ నీలాపురంలో గ్రామసభ నిర్వహించారు. నీలాపురంలో పలు సమస్యలపై 17 వినతులు వచ్చినట్లు చెప్పారు. ఈ సదస్సులో రీసర్వే డిటి ఎన్. తిరుపతిరావు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రౌతు సురేంద్ర, మాజీ ఎంపిటిసి ఎం. సత్య నారాయణ, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని గండ్రేడు రెవెన్యూ పరిధిలోని భూములకు సంబంధించి గండ్రేడు గ్రామంలో రీసర్వే డిటి కూన వైకుంఠరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు ధరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణపతిరావు, తాడివలస సచివాలయ సర్వేయర్ పైడి కాంతారావు, విఆర్‌ఒ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


లావేరు : గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు


సారువకోట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మెళియాపుట్టి : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బడే పాపారావు సూచించారు. మండలంలోని మాకనాపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 వినతులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, సర్వే డిటి వెంకటరావు, సర్పంచ్ తాడేల కామరాజు పాల్గొన్నారు.

సారవకోట: భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని అంగూరు బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ రీ సర్వేలో లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు, టిడిపి బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం
వెలుగు విఒఎల మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వెలుగు విఒఎల సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. విఒఎలపై రాజకీయ వేధింపులు ఆపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు బుధవారం వెలుగు ఎపిఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని పోరాట సందర్భంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఆందోళనలో చంద్రబాబు, లోకేష్ విఒఎల పోరాటాల వద్దకు వచ్చి హామీ ఇచ్చారన్నారు. విఒఎలను రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 5జి ఫోన్లు ఇవ్వాలని కోరారు. విఒఎల మెడపై కత్తిలా ఉన్న కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో విఒఎలు కె.జయలక్ష్మి, బి.భారతి, డి.అసిరితల్లి, సునీత, వరలక్ష్మి పాల్గొన్నారు.

విఒఎల వేతనాలు చెల్లించాలి

కొత్తూరు: వెలుగు సంస్థలో పనిచేసే విఒఎలకు ఏడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని యానిమేటర్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సతివాడ బాలామణి, గొర్లె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మహిళా సమైక్య కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి జిఒను రద్దు చేయాలన్నారు. సిబిఒహెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఈ.లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్


కొత్తూరు : నినాదాలు చేస్తున్న వెలుగు విఒఎలు

సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యాప్‌ల వర్కుల కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ ధర్నాకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మద్దతు తెలిపారు. అనంతరం ఎంపిపి సవర సావిత్రి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎపిఎం లలితకుమారిలను కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బిల్లింగి బెనర్జి, పి.చిన్నమ్మడు, జి.ధనలక్ష్మి, డి.జయంతి, డి.మణికుమారి, చందు, సుమ, శ్రావణి, స్వాతి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న బాలాజీ

గురుకుల పాఠశాల తనిఖీ

పాతపట్నం: ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజ పాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుదవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థులపై ఎటు వంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయు సిబ్బంది పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న వాబ యోగి

ఆదివాసీల సంస్కృతిని కాపాడాలి

టెక్కలి: రాష్ట్రంలోని ఆదివాసీ సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రభుత్వమే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజానికి, నాగరిక ప్రపంచానికి దూరంగా ఉన్న వీరి ఆచార వ్యవహారాలపైన, సంస్కృతిపైన, సాంప్రదాయాలపై ప్రభుత్వం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల జీవన విధానం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు వీరికి కావాల్సిన మ్యూజియం, వంటి అంశాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రత్యేక జీవన విధానాన్ని కలిసి ఉన్న ఆదివాసీలు సాంస్కృతి ఏ మతానికీ సంబంధం లేదన్నారు.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు

రణస్థలం రూరల్ : మద్యాన్ని అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని రణస్థలం ఎక్సైజ్ సిఐ అనురాధ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. మద్యాన్ని ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మద్యం దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేశామని, 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయించకూడదని, ఒక వ్యకి కి మూడు బాటిల్స్‌కు మించి ఎక్కువ అమ్మరాదన్నారు. బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే గోవిందరావు


ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం
ప్రజాదర్బార్‌తో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి బుధవారం వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయ చరిత్రలో లేనివిధంగా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. భూ వివాదాలు, రెవెన్యూ, రోడ్ల సమస్య, విద్యుత్ కోతలు, తాగునీరు, పింఛన్లు, నూతన రేషన్ కార్డు, ఇళ్లు కావాలని ఎక్కువ శాతం వినతులు వచ్చాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎంపిడిఒ చంద్రకుమారి, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, సతీష్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

మా పింఛన్లను ఇప్పించండి

ప్రజాశక్తి- బూర్జ
మా పింఛన్లను ఇప్పించాలని మండలంలోని తోటవాడ గ్రామస్తులు పలువురు బుధవారం గ్రామ సచివాలయం వద్ద నినాదాలు చేశారు. ఇంతవరకు తప్పనిసరిగా పింఛన్ వచ్చేదని అయితే గత మూడు నెలలుగా రాజకీయ కక్ష సాధింపులతో మా పింఛన్లను నిలిపివేశారని గ్రామానికి చెందిన సేపాన గోవిందరావు, భుజంగరావుతో పాటు మరి కొంతమంది తెలిపారు. కేవలం రాజకీయ కక్షలతో తమ పింఛన్లను నిలుపుదల చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. సచివాలయం వద్ద నినాదాలు చేశారు.


పింఛను పుస్తకాలు చూపిస్తున్న లబ్ధిదారులు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి
ఫీల్డ్ అసిస్టెంట్లకు చాలీచాలని వేతనాలతో 17 ఏళ్లుగా కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల భవిష్యత్ కార్యాచరణ గురించి మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్తామని అన్నారు. సమావేశంలో బొల్ల సింహాచలం, శ్రీరామ్ చాణిక్య, గోవర్ధన్, కాళిదాసు, మోహనరావు, సింహాచలం, తిరుపతిరావు, ప్రసన్న, స్వర్ణ కుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి- సారవకోట
మహిళా అభ్యున్నతికి, సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయాలని నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. దీపం-2 పథకం అమలు ద్వారా పేద మహిళలకు భరోసా కల్పించేలా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. 2014-19లో దీపం పథకం కింద పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు, రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బంది కొరత

అదనపు బాధ్యతలతో ఒత్తిడిలో ఉద్యోగులు

ప్రజాశక్తి- కవిటి
కవిటి మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎంపిడిఒ పోస్టుతో పాటు జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. దీంతో వారు ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా ఎంపిడిఒ లేకపోవడంతో ఎఒ శ్రీనివాస్‌రెడ్డి ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎఒ బాధ్యతలకు విఘాతం కలుగుతోంది. అలాగే ఇప్పటివరకు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వినోద్ ఇచ్ఛాపురం బదిలీ అయ్యారు. టైపిస్టు రాజేష్ బూర్జ మండలం బదిలీ అయ్యారు. నలుగురు ఉండాల్సిన ఆఫీస్ సబార్డినేటర్లకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వెరసి సీనియర్ అసిస్టెంట్‌పై ఒత్తిడి పెరుగుతోంది. వాస్తవానికి గతంలో ఎంపిడిఒగా చేసిన సూర్యనారాయణరెడ్డి మరికొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అతనికి బదిలీ అయ్యే అవకాశం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన మందస మండలం బదిలీపై వెళ్లారు. కష్టపడి పనిచేసిన వ్యక్తికి బదిలీ సమయంలో కూడా సరైన వీడ్కోలు లభించలేదు. మండల కేంద్రమైన కవిటిలో, అందులోనూ కీలకమైన ఎంపిడిఒ కార్యాలయంలో ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి ఉండడంతో సిబ్బందితో పాటు ప్రజలకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రాబోయే రోజుల్లో ప్రభుత్వం కొత్త కొత్త పథకాలు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేసే సమయంలో ఈ సమస్య మరింత తీవ్రం కానుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని వెంటనే ఎంపిడిఒతో పాటు జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న ఎఒ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ కుర్చీలు

విశాఖలో కొత్తపేట మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


జగదీష్ (ఫైల్)

విశాఖపట్నం సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన కొత్తపేటకు చెందిన మత్స్యకారుడు గుండుపల్లి జగదీష్ (36) మృతి చెందారు. ఈ నెల 4న చేపల వేటకి వెళ్లి వల తాడును ఒడ్డుకిలాగే క్రమంలో సముద్రంలో పడి గల్లంతయ్యారు. రెండు రోజుల పాటు గాలించగా మృతదేహం లభ్యమైంది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వ్యక్తిపై దాడి

కోటబొమ్మాళి: మండలంలోని కురుడుకు చెందిన జలుమూరు దశమయ్యపై భార్య పావని, దంతకు చెందిన అత్తామామ బొమ్మాళి మహాలక్ష్మి, ఆదిలక్ష్మిలు దాడి చేశారని ఎస్ఐ వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. దశమయ్యకు భార్య పావనిలో కొంతకాలం క్రితం విభేదాలు రావడంతో దంతలోని కన్నవారి ఇంట్లో ఉంటుందన్నారు. అయితే తన కుమారుడుకు ఆధార్‌కార్డు అవసరం కావడంతో అత్తవారు ఇంట్లో ఉన్న భార్య పావని దగ్గరకు బుధవారం వెళ్లాడని అన్నారు. ఆధార్ కార్డు అడగ్గా, వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుందన్నారు. సమయంలో వారు కోపోద్రిక్తులై దాడికి చేశారని దశమయ్య ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

పాతపట్నం : మండలంలోని కొరసవాడ రెడ్డిక వీధిలో అమర శ్రీలత ఇంటి వరండాలో మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా నిద్రిస్తుండగా, అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు, రెండు తులాలు ఉన్న ఆభరణాలను దొంగిలించారని ఎస్ఐ సింహాచలం బుధవారం తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ఇచ్ఛాపురం : ఒడిశా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.డి.ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ పరిధిలోని బుధవారం చేసిన దాడుల్లో బిర్లంగికి చెందిన రత్నాల భగవాన్ మద్యం సీసాలతో పాటు ఆయనను అరెస్టు చేశామన్నారు. నిందితుడిని స్థానిక తహశీల్దార్ వద్ద బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

గుంతలు లేని రోడ్డు పనులకు శ్రీకారం

ఇచ్ఛాపురం: నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని తులిసిగాం నుంచి బూర్జిపాడు వరకు రూ.24.5 లక్షలతో రోడ్డు పనులకు ఈదుపురం వద్ద బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎక్కడా గుంతలు లేకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. టిడిపి నాయకులు దక్కత డిల్లీరావు, బోర ప్రసాద్, కామేశ్వరరావు. సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు నిధుల మంజూరు


రవణమ్మ, సర్పంచ్

సోంపేట: కొర్లాం 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.54.22 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కొర్లాం సర్పంచ్ రామ్‌బుడ్డి రవణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, ఉద్దానంలో వ్యవసాయ అభివృద్ధికి, బారువ పర్యాటక రంగానికి సబ్‌స్టేషన్ అభివృద్ధి ఎంతో దోహద పడుతుందన్నారు. సుమారు మూడు లక్షల మంది ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. సోంపేట, కవిటి, మందస ఉపయోగపడుతుందని అన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు


మాట్లాడుతున్న బాబూరావు

సోంపేట : పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేస్తామంటూనే, అనేక రకాలై పనులు అప్పజెప్పి ఒత్తిడికి గురి చేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ పనులు చేయడానికి తగిన సమయం కూడా ఇవ్వకుండా ఇటు జిల్లా అధికారుల నుంచి, అటు మండల అధికారుల నుంచి విపరీతమైనటువంటి ఒత్తిడి చేస్తూ ఉపాధ్యాయుని గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. బోధన కార్యక్రమానికీ దూరం చేస్తూ, సాంకేతిక లోపాల వల్ల పనులు జరగకపోయినప్పటికీ ఆ కారణాలూ ఉపాధ్యాయులను బాధ్యత చేయడం తగదన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ ఆ పనులను పూర్తి చేసుకోవాలన్నారు. వివిధ రకాలై శిక్షణ కార్యక్రమాల వల్ల కూడా పాఠశాలల్లో నిర్వహి స్తున్న బోధనకు దూరం అవడం వలన సకాలంలో పూర్తి చేయాల్సిన సిలబస్ ని కూడా కంప్లీట్ అవ్వక తదుపరి పిల్లలకు గాని, ఉపాధ్యాయులకు గాని విపరీతమైన ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటి శిక్షణలన్నీ సెలవుల్లో జరిగేలా చూడాలని కోరారు.

కోనేరు గట్టుపై ఆక్రమణలు

టెక్కలి రూరల్ : మేజర్ పంచాయతీ పట్టు మహాదేవ కోనేరు గట్టుపై ఆక్రములకు గురవుతున్నా అధికారులు నిమ్మకునీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఆక్రమ తొలగించినా మరలా ఆక్రమణదారులు ఆక్రమించు కుంటున్నారు. గత ప్రభుత్వం రూ.70 లక్షలు ఖర్చు చేసి సిమెంట్ రిటర్నింగ్ వాల్ నిర్మించారు. దానిపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఖాళీగా ఉన్న గట్టుపై ఆక్రములకు గురవుతున్నాయి. దీనిపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

డ్వాక్రా సంఘాలు బలోపేతం

ప్రజాశక్తి- పలాస
డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా చేరవేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మెప్మా అధికారులు, సిబ్బందికు స్వయం శక్తి సంఘాల ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రొఫైలింగ్ యాప్‌లో స్వయం సహాయక సంఘ సభ్యుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కోరారు. యాప్‌లో రోజుకు రెండు సంఘాల సభ్యుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. సమీప భవిష్యత్‌లో ఈ సంఘల కార్యక్రమాలన్నీ ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనసాగుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, సిఎంఎం మోహన్, సిఒలు, సిఎల్‌ఆర్‌పిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎఐటియుసి నాయకులు

శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
నగర పాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ మేస్త్రీలను రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించడం అన్యామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కళ్యాణి, అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సుదీర్ఘ కాలంగా సక్రమంగా విధులు నిర్వహిస్తున్న పెదలపు మోహన్ కృష్ణ, పెసల రాము, అల్లు ఉపేంద్రరావులను విధుల నుంచి తొలగించారని, లిఖిత పూర్వకమైన షోకాజ్ నోటీసు, మెమో ఇవ్వకుండా రాజకీయ కారణాలతో నిలుపుదల చేశారని ఆరోపించారు. తక్షణమే వారిని తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు, నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, కళ్యాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

కాంపోనెంట్ పనులు వేగవంతం

ప్రజాశక్తి- మెళియాపుట్టి
ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాయకులతో, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో రూ.5.26 కోట్ల నిధులతో 85 సిమెంట్ పనులు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని యుద్ధప్రాతిపదికగా పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ నిధులు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రాప్తికి పనులు చేపడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల పిఆర్ ఇంజినీర్ ఆనందరావు, ఎపిఒ టి.రవి, ఇసి ఆదినారాయణరెడ్డి, బూర్ల లలితకుమారి, రవ్వల గణపతిరావు, కదంబల పైడి రాజు, అగ్గాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి
టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పొలం భవానీశంకర్, బగడ ఉదయ్, చరణ్ తేజ్, ఉప్పాడ ప్రభాస్, చిరంజీవి ప్రధానో, సత్తార్ కిరణ్‌కుమార్‌లు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులకు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి పది వరకు రాజమండ్రి, ఏలూరు, కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాజట్టు తరుపున వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను గుర్తించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మలను అభినందించారు. కార్యక్రమంలో రోణంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వర్తకులతో మాట్లాడుతున్న కార్యదర్శి ప్రసాద్

నిబంధనలు పాటించాలి

రణస్థలం రూరల్ : పరిసరాల పరిశుభ్రతకు భంగం కలిగితే శిక్ష తప్పదని జె.ఆర్.పురం గ్రామ పంచాయతీ గ్రేడ్‌వన్ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ వర్తకులకు హెచ్చరించారు. హోటళ్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా, టీ, జ్యూస్ షాప్‌ల వలన పంచాయతీలో అపరశుభ్రత ఏర్పడుతుందన్నారు. చెత్తాచెదారంను రోడ్లపై, జనవాసాలకు కిలోమీటర్ పరిధిలో వేయరాదన్నారు. నిబంధనలు పాటించనియెడల భారతీయ శిక్షా సెక్షన్ 283, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం -1994 సదలి సెక్షన్ 82 సబ్ సెక్షన్ (1)లో (ఎ) (బి) (సి) (డి) (ఇ) ప్రకారంగా నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. చెత్త బుట్టను ఏర్పాటు చేసుకొని రోజువారి చెత్తను చెత్త ట్రాక్టర్‌లో వేయాలన్నారు. పంచాయతీ శానిటేషన్ మేస్త్రీ వడ్డాది పాణి కుమార్ ఉన్నారు.


న్యాయమూర్తికి వీడ్కోలు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ ఉన్నత న్యాయమూర్తి కుమారి అంకితకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, సిబ్బంది బుధవారం వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు సైలాడ శ్రీరాములు, కాంచరాల లక్ష్మీప్రసాద్, రొక్కం శ్రీనివాస్, శిశిరకుమార్‌జనా, రామనాథ్‌దొలై, పి.విశ్వనాథం, ఎస్.కె.పండా పాల్గొన్నారు.

భూ రీ సర్వేలో మాయాజాలం

- పాత రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం కుదింపు
- రీ సర్వేలో రెవెన్యూ లీలలు


రీ సర్వే తర్వాత పది సెంట్లు తగ్గించి ఇచ్చిన భూహక్కు పత్రం



రీ సర్వేకు ముందు పాత పట్టాదారు పాస్ పుస్తకం ఒన్‌బి

ప్రజాశక్తి- లావేరు
భూముల సమస్యలు లేకుండా ఎన్నోఏళ్లుగా వివిధ రకాలుగా భూముల సమస్యలుతో సతమతమవుతున్న భూ యజమానులు, రైతులకు మేలు జరుగేందుకు గత వైసిపి ప్రభుత్వం భూముల రీసర్వే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టింది. ఇందులో భాగంగానే భూముల సర్వే జరిగిన తీరు చూస్తుంటే కొండ నాలుకకి మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా రీసర్వే సమస్యలతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. లావేరు మండలం లావేరు పంచాయతీ గూడెం గోలుగులువలస రెవెన్యూ గ్రామంలో సిద్ధాంతం రామలింగం పేరున రెవిన్యూ రికార్డులు, పట్టాదారు పాస్ పుస్తకంలో ఖాతా నెంబర్ 165 సర్వే నెంబర్ 32/3లో 0.24 సెంట్లు భూమి ఉండగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం పేరుతో రీసర్వే అనంతరం ఈ భూయజమని భార్య సిద్ధాంతం భూలక్ష్మి పేరున ఖాతా నెంబర్ 700 ఎల్‌పిఎం నెంబర్ 946 సర్వే నెంబర్ 32/3లో విస్తర్ణం 0.14 సెంట్లుగా కొత్త పాసుపుస్తకాన్ని రెవెన్యూ అధికారులు అందజేశారు. పుస్తకంలో విస్తీర్ణం పది సెంట్లు తగ్గిందని రెవెన్యూ అధికారులకు చెప్పగా తహశీల్దార్ కాలయాపన చేశారని రైతు భూలక్ష్మి వాపోయారు. రీసర్వేలో జరిగిన తప్పులు, విస్తీర్ణం హెచ్చుతగ్గులు తదితర సమస్యల పరిష్కారానికి రీసర్వే జరిగిన గ్రామాల్లో జరుగుతున్న గ్రామసభల్లో ఒక్కొక్కటి గత ప్రభుత్వం జరిపిన రీసర్వేలో జరిగిన సమస్యలు కోకొల్లలుగా వస్తున్నాయి. తమ భూములకు రీసర్వే చేసి తమకు భూములు, రికార్డులను ఇవ్వాలని కోరుతున్నారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు

పలాస : పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన హౌసింగ్ గ్రీవెన్స్‌కు 12 వినతులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. హౌసింగ్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

ఎచ్చెర్ల: యువత అసాంఘిక కార్యక్రమాల వైపు వెళ్లకుండా చెడు వ్యసనాలకు బానిస కాకూడదని ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్ కుమార్ సూచించారు. ఈ మధ్యకాలంలో కొంతమంది యువకులు గంజాయి సేవిస్తూ పట్టు పడటం అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సాధించాలని తెలియజేస్తూ నేటి యువత తల్లితండ్రుల ఆశయాలకు అనుకూలంగా తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006, ఫోక్స చట్టం 2012, భారతీయ న్యాయ సమీహిత 375 పరిధిలోకి వచ్చే మహిళా వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో యువతకి సూచించాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో గణేష్‌కు ద్వితీయ స్థానం

పోలాకి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పిట్ట గణేష్ వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ సంపాదించడం అభినందనీయమని ఎంఇఒ-2 టి.లింగరాజు అన్నారు. ఈ మేరకు పాఠశాలలో గణేష్‌కు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అటువంటి విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారధిగా పనిచేయాలి

కవిటి: విధి నిర్వహణలో అలసత్వం లేకుండా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు పర్యవేక్షించి, వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. పిఆర్ యాప్-1 ఎప్పటికప్పుడు నవీనీకరించుకుని, పంచాయతీల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి పాల్గొన్నారు.

ఎల్ఐసి పాలసీలపై జిఎస్‌టి ఎత్తివేయాలి

పలాస: ఎల్ఐసి పాలసీలకు జిఎస్‌టి ఎత్తివేయాలని ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు జినగ రాజేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ఎల్ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసి ఏజెంట్లు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని 36 రోజులుగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించు కోకపోవడం దారుణమన్నారు. పాలసీ హోల్డర్స్ బోనస్ పెంచాలన్నారు. ఏజెంట్లకు 68 ఏళ్లుగా ఒకే విధమైన ఇస్తున్న కమీషన్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వి.ఈశ్వరరావు, బ్రాంచ్ ట్రెజరర్ బి.వాసుదేవరావు, డివిజన్ ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ బి.రుక్మాంగదరావు, ఏజెంట్లు ఎన్.ప్రకాశరావు,రామ్మూర్తి, శ్యామసుందరరావు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

పాతపట్నం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు మినుములు, పెసలు విత్తనాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి మంచు కరుణాకరరావు, టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ రైతు సేవా కేంద్రంలో వేరుశనగ, మినప, పెసర విత్తనాలను పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు హరివరప్రసాద్, టెక్కలి వ్యవసాయ సహాయ సంచాయలకులు బి.వి.తిరుమలరావు, ఎఒ ఎస్.గోవిందరావు, సర్పంచ కింజరాపు సురేష్‌లు పంపిణీ చేశారు.

ఆరుతడి పంటల సాగుపై అవగాహన

సోంపేట: మండలంలోని మాకన్నపురం రైతు సేవా కేంద్రం పరిధిలోని భూసభద్ర, సుంకిడి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నరసింహమూర్తి రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పిం చారు. విత్తన ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యాన అందించిన విత్త నాల సాగు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతు లతో ఆరుతడి పంటలపై దృష్టాసారించాలన్నారు. రైతు లకు విత్తనాలు, పరదాలు అందిస్తున్నట్లు తెలిపారు.

సేంద్రీయ పంటలు ఆరోగ్యకరం

నందిగాం: సేంద్రీయ పంటల ద్వారా ఆరోగ్యం పొందేందుకు ఎంతో మేలు జరుగుతుందని పోషక వాటిక మండల ఇన్‌ఛార్జి పి.లోకేష్ అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, దేవిపురం గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల వద్ద ఘనజీవామృతం తయారీ విధానం, వాటి ఫలితాలు గురించి బుధవారం వివరించారు. సేంద్రీయ ఎరువులు వాడకం ద్వారా కూరగాయలు పండించి వాటిని వినియోగిస్తే ఎటువంటి రోగకారక అవశేషాలు ఉండవని సూచించారు ఐసిఆర్‌పి గోవిందరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలో రైజ్ సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైజ్ సంస్థ అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లేట ఆధ్వర్యాన మహాత్మా గాంధి కేన్సర్ ఆస్పత్రి వైద్యుల సౌజన్యంతో కేన్సర్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులతో మాట్లాడి కేన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాల్సి, తీసుకోవాలిన జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి నందకి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లి, వార్డు కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, సీపాన రవి, సీపాన వెంకటరమణ, దక్కత ఢిల్లీరావు, సహదేవ్, కాళ్ల జయదేవ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి, డాక్టర్ సంతోష్, ఆసి జీవులురెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



పలాస : మాట్లాడుతున్న నవీన్

ప్రజాశక్తి- పలాస
విద్యార్థులకు ఇంటర్మీడియట్, డిగ్రీ దశే కీలకమని, ఆ సమయంలోనే ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకోవాలని పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి, అంజనా ప్రొడక్షన్స్ చైర్మన్ నవీన్ అన్నారు. డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగాలపై దృష్టి సారించాలన్నారు. జాబ్‌మేళా నిర్వహించే సమయంలో తమ ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. జాబ్‌మేళాలో ఫాక్స్ కాన్, ఏపిల్ సెల్, స్నిడర్ ఎలక్ట్రానిక్, సోలార్ పేనల్ ఎసెంబ్లింగ్, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలు పాల్గొన్నాయని, 40 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి, కో-ఆర్డినేటర్ రమణ, ఎం.హేమాచలం పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు నిరుద్యోగులు ఎంపికయ్యారని అంజనాస్ ఫౌండేషన్ చైర్మన్ నవీన్‌బచ్చు తెలిపారు. ఫాక్స్‌కాన్, యాపిల్ మైబైల్స్, స్నీడర్ ఎలక్ట్రికల్, ఐఫోన్ వంటి ఆరు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని అన్నారు. 154 మంది హాజరు కాగా, 107 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.లూక్‌పాల్, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు మోపొద్దు


మాట్లాడుతూ మాధవరావు

ప్రజాశక్తి- పలాస
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల సమయంలోనే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, ట్రూ ఆఫ్ ఛార్జీలు పేరుతో ప్రజలపైన భారాల వేయడానికి సిద్ధపడిందని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మండిపడ్డారు. కాశీబుగ్గ పరిధి సూదికొండ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ట్రూ ఆఫ్ ఛార్జీల పేరిట వినియోగదారుల నుంచి రూ.6072 కోట్లు అదనపు ఎలక్ట్రిసిటీ బిల్లులు వసూళ్లకు ప్రభుత్వం ఒడిగట్టడం దుర్మార్గమన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-23 ఏడాదిలో వాడుకున్న విద్యుత్ ఇప్పుడు వినియోగదారుల నుంచి బిల్లు వసూలు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే విద్యుత్ బిల్లు నియంత్రిస్తామని సోలార్ పథకం ద్వారా బిల్లులు భారం తగ్గిస్తామని ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు హామీ ఇచ్చి చంద్రబాబు ప్రజలకు మోసం చేయడం సరైనది కాదన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారం పాల్గొన్నారు.

22న అమరవీరుల స్మారక సభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమం ముందుకు తీసుకెళ్తామని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ అన్నారు. ఈ నెల 22న ఉదయం 9 గంటలకు మర్రిపాడులో నిర్వహించనున్న శ్రీకాకుళ అమరవీరుల 46వ స్మారక సభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మర్రిపాడు గణపతి నగర్‌లో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళ సాయుధ పోరాట అమరవీరులు తామాడ గణపతి, డాక్టర్ చాగంటి భాస్కరరావులు పోలీసుల బూటకపు ఎదురు కాల్పుల్లో అమరత్వం చెందారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐకెయంయస్ జిల్లా నాయకుడు రాపాక మాధవరావు, పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త జడ్డే అప్పయ్య పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదుకుందాం


ఆహార పదార్థాలను అందజేస్తున్న మురళీధర్

శ్రీకాకుళం అర్బన్: నిరాశ్రయులను ఆదుకొనేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు. కొంక్యాన శాంతమ్మ 20వ వర్థంతి సందర్భంగా నగరంలోని గొంటివీధి, ప్రకాష్‌నగర్ కాలనీ వద్ద నైట్ షెల్టర్లలో నిరాశ్రయులు, నిరుపేదలకు మంగళవారం రాత్రి ఆహార పదార్థాలు, పండ్లు పంపిణీ చేశారు. తన తండ్రి కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు తరపున పలుమార్లు భోజన వితరణ చేశామని ప్రభుత్వం నుంచి సహకారమందితే నిరుపేదలకు ఆకలి తీరుతుందన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ సంచార జాతులు, సొంత ఇళ్లు లేనివారు ఎందరో నైటెషెల్టర్లలో చిన్న పిల్లలు, వృద్ధులతో ఉంటున్నారని, ఆహార పదార్థాలు అందక అలమటిస్తున్నారని, వీరికి రేషన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొంక్యాన ట్రస్టు సభ్యులు మంగమ్మ, సరోజ, కొంక్యాన శివశంకర్, డాక్టర్ వినీల, తేజేస్విని, గౌతమ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్ పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తిరుపతి

బూర్జ: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన విస్తరణ అధికారి హెచ్.తిరుపతి సూచించారు. బుధవారం మండలంలోని మసానపుట్టి గ్రామంలో రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. వాతవరణం ఆధారిత పంటల భీమా పథకం రబీ 2024-25 భీమా పరిహార పరిధి కోసం, భీమా వర్తించే వాతవరణ పరిస్థితులు అకాల అధిక వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వలన పంటలు నష్టపోయేటప్పుడు ఈ బీమా ఆర్థికంగా ఆదుకుంటుందని వివరించారు. ఎకరాకు రూ.1600, హెక్టారుకు రూ.4 వేలు ప్రీమియం చెల్లించాలని, నవంబర్ 15తో గడువు ముగియనుందన్నారు. రైతులు మీసేవలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సవర రాంబాబు, వెంకటేష్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ఎస్.సబీనా, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎ-2 పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి- టెక్కలి
విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎస్ఎ-2 పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్ఎస్ఎ ద్వారా ప్రశ్నాపత్రాలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. మొదటి రోజు ఉదయం తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు, ఒకటి నుంచి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. రెండో పూట 6,7,8, తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. ఒఎంఆర్ షీటు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు జవాబుపత్రాలపైనే పరీక్షలు రాశారు. మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నారు. వాస్తవంగా మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభం కావల్సి ఉన్నా... నాగుల చవితి కారణంగా స్థానిక సెలవు కావడంతో పరీక్ష వాయిదా పడింది. ఈ సమయానికి త్రైమాసిక పరీక్షలు నిర్వహించా ఉండగా, ఇంకా ఎస్ఎ-2 పరీక్షలు నిర్వహించడం గమనార్హం.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- టెక్కలి
డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటిపై దృష్టిసారించాలని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ సూచించారు. కళాశాల ఆవరణలో బిఎ ఆర్ట్స్ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సినీ గేయాలకు విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, అధ్యాపకులు త్రినాథరావు, శ్రీనివాసరావు, ధర్మారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నవితరణ చేస్తున్న దుర్గాప్రసాద్

వృద్ధాశ్రమంలో అన్న వితరణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బొందిలీపురంలో ఉన్న ఖ్యాతి వృద్ధాశ్రమంలో తన జన్మదిన వేడుకలు సందర్భంగా కోరాడ దుర్గాప్రసాద్ అన్న వితరణ చేశారు. నిస్సహాయ స్థితిలో వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు తనవంతు సాయంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో వి.విజయ్, బొట్టా శంకర్, కలగ రాజు, కోరాడ గౌతమ్, నవీన్ ప్రసాద్, ఖ్యాతి వృద్ధాశ్రమం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ ట్రిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఇండస్ట్రియల్ ట్రిప్ విజయవంతం

ప్రజాశక్తి- రణస్థలం
ఇండస్ట్రియల్ ట్రిప్ పరిశీలన కార్యక్రమంలో భాగంగా స్థానిక కొండ ములగాం ప్రభుత్వ ఆదర్శ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చిలకపాలెం శివాని ఇంజనీరింగ్ కళాశాలకు బుధవారం వెళ్లారు. అక్కడ సాఫ్ట్ వేర్, పైతాన్, సి.లాంగ్వేజ్, ఇఆర్‌పిపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో టెక్నికల్ ఉద్యోగ అవకాశాలకు ఉపయోగ పడుతుందని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐటి విభాగ ఉపాధ్యాయులు జి.రత్నబాబు, అధ్యాపకులు సూర్యకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అఖిల్

రోడ్ల పనులు పరిశీలన

వజ్రపుకొత్తూరు: టిడిపి ప్రభుత్వం అధిక్కారంలోకి రావడంత్తో గ్రామాల్లో అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందని సుంకర జగన్నాథపురం సర్పంచ్ గాడి అఖిల్ అన్నారు. మండలంలోని ఉద్దానం రాయపాడులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 75 మీటర్ల పొడవుతో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీ లాండ్స్ పంచాయతీ నిధులు నుంచి రూ.ఐదు లక్షల ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మరికొన్ని సిసి రోడ్లు నిర్మాణాలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో పంచాయతీ అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు నాగభూషణం, కమలాకర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి
రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని మండల ఎఒ బడగల దుర్గా ప్రసాద్ సూచించారు. మండలంలోని వరకలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారా భూమిలో సారం పెరుగుతుందన్నారు. పెసర, మినుము, పిల్లి పెసర తదితర పంటల ద్వారా భూమిలో సారం పెరిగి నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. నేల సారవంతంగా మారడంలో పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైరు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ పురియా, విఆర్ఒ కూర్మారావు, వ్యవసాయ సహాయకుడు జగదీష్, కార్యదర్శి హరికృష్ణ, మహేష్ జెన్నా, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్